క్లుప్తంగా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల పరిధిలోని ప్రజల నుంచి తీసుకుంటున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుండి 10 అర్జీలను తీసుకున్నారు. వాటిలో రెవిన్యూ 5, సర్వే 4, రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్వీకరించిన 1 అర్జీని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



పొన్నూరు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కూల్ డ్రింక్స్ లోడుతో వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటన సోమవారం మండలంలోని కట్టెంపూడి ప్రధాన రహదారిలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో ఆటోలోని కూల్ డ్రింక్స్ సీసాలు కింద పడడంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

టీడీపీకి బీసీలంటే చులకన

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం బీసీ విభాగం అధ్యక్షుడు అశోక్‌కుమార్

గుంటూరు రూరల్: కృష్ణాజిల్లా జెడ్పీటీసీ చైర్‌పర్సన్ వైఎస్సార్ సీపీ బీసీ నాయకురాలు ఉప్పాల హారికపై గుడివాడలో కూటమి గూండాలు, రౌడీల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రత్తిపాడు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు దారం అశోక్‌యాదవ్ తెలిపారు. సోమవారం బొంతపాడులోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రజా సేవలో ఉన్న ఒక బీసీ మహిళ మీద కూటమి గుండాలు దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ దాడిని కూటమి ప్రభుత్వం బీసీలపై చేసిన కక్ష పూరిత దాడిగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారి మీద కాకుండా ఘటనలో బాధితుల మీద కేసులు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు, గుండాలపాడు, వేములూరిపాడు, అమీనాబాద్, మేరికపూడి గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పూషాడపు శివసుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 0–6, 6–15 ఏళ్ల వయస్సు గల వారికి నూతన ఆధార్ రిజిస్ట్రేషన్, ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. యర్రగుంట్లపాడు సచివాలయంలో 15వ తేదీ నుంచి 18 వరకు.. వేములూరిపాడు ఉర్దూస్కూల్, అమీనాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 22వ తేదీ నుంచి 25 వరకు.. గుండాలపాడు సచివాలయంలో 15వ తేదీ నుంచి 18 వరకు.. మేరికపూడి సచివాలయంలో 22వ తేదీ నుంచి 25 వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సచివాలయం సిబ్బంది డీఏలు జి.సునీత, ఎస్.విజయభాస్కర్, మహిళాపోలీసులు బి.సుందరి, ఎం.శాంతి, ఎం.అనిత, ఎ.గాయత్రిలు విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

ప్రారంభమైన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. జరుగుల బంగారుబాబు, శివకుమారి గార్ల సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచించారు.

జీతాలు పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలి

నెహ్రూ నగర్: రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయకుంటే తిరిగి సమ్మెలోకి వెళ్తామని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు.

నీళ్లో రామచంద్రా..!



ట్యాంకర్ కోసం ఎదురు చూస్తున్న టిడ్కో గృహవాసులు



క్యాన్ ద్వారా నీటిని తీసుకువెళుతున్న మహిళ

- తాగునీరు లేక టిడ్కో గృహవాసుల ఇబ్బందులు
- అరకొరగా ట్యాంకర్లతో సరఫరా
- నిర్లక్ష్య వైఖరిలో మున్సిపల్ అధికారులు

పొన్నూరు: మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. బిందెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పైప్ లైన్లలో లీకుల కారణంగా తాగునీటి సమస్య ఏర్పడినా తక్షణ చర్యలు శూన్యంగా ఉంటున్నాయి. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎండిన గొంతుకతో వాపోతున్నారు.

అవస్థలు పడుతున్న స్థానికులు..

పట్టణంలోని టిడ్కో గృహాలకు గత 4 రోజుల నుంచి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరిప్పించండి మహాప్రభో అంటూ వేడుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. గృహ సముదాయాలకు సమీపంలోనే 100 ఎకరాల తాగునీటి చెరువు ఉన్నా తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గృహవాసులు ఆరోపిస్తున్నారు. కంటితుడుపు చర్యగా అరకొరగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నా.. అవి పూర్తిస్థాయిలో అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

లీకుల కారణంగా సమస్య..

ప్రజల సౌకర్యార్థం 21.70 ఎకరాల్లో సుమారు రూ.177.34 కోట్లతో 2,368 గృహాలు నిర్మించారు. ప్రస్తుతం 1000 కుటుంబాలు జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ ప్రధానంగా తాగునీటి సమస్య స్థానికులను వేధిస్తోంది. 100 ఎకరాల తాగునీటి చెరువు నుంచి పైప్‌లైను ద్వారా టిడ్కో గృహాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆ పైప్ లైనుకు ఏర్పడుతున్న లీకుల కారణంగా నీటి సరఫరా సరిగా జరగడం లేదని.. రోజుల తరబడి నీటి సమస్య తలెత్తుతుందని స్థానికులు చెబుతున్నారు. సమస్య జటిలంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ల నుంచి నీటిని నాలుగో అంతస్తులోకి తీసుకువెళ్లలేక అల్లాడిపోతున్నామని వేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి..



టిడ్కో గృహాలకు 4 రోజుల నుంచి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగడం లేదు. స్థానికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వందల మంది జనాభా ఉన్న ప్రాంతానికి రోజుకు రెండు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నాం.

మంద్రు సుహాసిని, స్థానికురాలు

చిరుధాన్యాల ఆహారం గ్లోబల్ వార్మింగ్‌కి పరిష్కారం



శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సరళఖాదర్, ఫౌండేషన్ సభ్యులు

గుంటూరు రూరల్: మారుతున్న మన ఆహారపు అలవాట్లు, జీవన సరళి వల్ల గ్లోబల్ వార్మింగ్ రోజురోజుకీ పెరుగుతుందని.. దానికి పరిష్కారం చిరుధాన్యాల పంటలు, ఆహారం ద్వారానే సాధ్యమని చిరుధాన్యాల నిపుణులు డాక్టర్ సరళ ఖాదర్ తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట రైతునేస్తం ఫౌండేషన్‌లో రైతులకు ఏర్పాటు చేసిన చిరుధాన్యాల పంటలు, ఆహారం విలువల జోడింపుపై శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కువ మంది ప్రజల ప్రధాన ఆహారాలైన వరి, గోధుమ, చెరుకు పంటల సాగుకు విపరీతంగా నీటి అవసరం ఉంటుందని, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకున్నట్లయితే తక్కువ నీటితో ఆరోగ్యకరమైన పంటలను పండించుకోవచ్చని తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చిరుధాన్యాలను సరైన మెళకువలతో ఆహారంగా తీసుకున్నట్లయితే ఎలాంటి ప్రతికూల ప్రభావాలు ఉండకపోగా ఆరోగ్యాలను పదిలంగా ఉంచుతాయన్నారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, ఫౌండేషన్ సిబ్బంది తదితరులున్నారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె సోమవారానికి రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి నారాయణ ప్రకటించారని, ముఖ్యమంత్రి ఆదేశించిన తర్వాత ఇంకా ఆలస్యం చేయటం ఏమిటని ఎద్దేవా చేశారు. మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి పని చేస్తూ పట్టణ ప్రజలకు మంచినీరు, పారిశుద్ధ్యం అందిస్తున్నారని, అలాంటి వారికి జీతాలు పెంచకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం ఏమిటని అన్నారు. గత సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలని సంవత్సరం నుంచి కోరుతున్నా జీఓలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, అధికారులు కార్మికులను షోకాజ్ నోటీసులు అంటూ, పనిలో తొలగిస్తామని భయపెట్టడం హేయమైన చర్య అని అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఒ.నారాయణరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని అన్నారు. బీసీ బహుజన ఫ్రంట్ కన్వీనర్ తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకుంటూ వారికి ఇవ్వవలసిన కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని అన్నారు. రెండో రోజు సమ్మెలో గుంటూరు నగరపాలక సంస్థలోని వాటర్ వర్క్స్ కార్మికులు, లీకు వర్కర్స్, టౌన్ ప్లానింగ్ దళం, సెక్యూరిటీ గార్డులు, పార్క్ గార్డెనర్స్ పాల్గొన్నారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు ఆది నికల్సన్, షేక్ ఖాసీం వలి, కార్మికులు పాశం పూర్ణచంద్రరావు, కాటంరాజు, సిద్దా బత్తిన శ్రీనివాసరావు, జి సురేష్ బాబు, బాలకృష్ణ యాసిడ్ ఖాన్, కాశయ్య, సలాం, భాష, మహేష్, సుబ్రహ్మణ్యం, ఆర్ముగం, నాగరాజు, దుర్గారావు, ఏసు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయ అభివృద్ధికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: పర్యావరణ హితంగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్, కమిషనర్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం నీరు రాకుండా అవసరమైన మేరకు మెరక చేయాలన్నారు. కార్యాలయ ఆవరణలో మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గేట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆఫీస్ ఎలివేషన్ వర్క్‌కి మోడల్స్ తీసుకురావాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టీ, ఈరంటి వరప్రసాద్, మీరావలి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారం రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ ప్రకారం చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

తెలుగు ప్రేక్షకులలో కోట శ్రీనివాసరావుకు ప్రత్యేక స్థానం

లక్ష్మీపురం: సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ నాటక రంగాలకు విశేష సేవలందించి వైవిద్య భరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల మదిలో కోట శ్రీనివాసరావు శాశ్వత ముద్ర వేసుకున్నారని అవగాహన సంస్థ సాంస్కృతి కార్యక్రమాల కన్వీనర్ అశోక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలక్షణ నటనతో సినీ ప్రియుల్ని మెప్పించి చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన నట దిగ్గజం కోట శ్రీనివాసరావు ఇక లేరనే వార్తను సినీ ప్రియులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. నాటక రచయిత కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ 1970 నుంచి తెలుగు తెరపై రాణించిన మేటి నటుడు కోట శ్రీనివాసరావు అన్నారు.

పవర్ లిఫ్టర్లను అభినందించిన మేయర్



నెహ్రూనగర్: జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో గుంటూరు జిల్లా ఖ్యాతిని చాటిన క్రీకారులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అభినందించారు. పవర్ లిఫ్టింగ్‌లో వివిధ మెడల్స్ సాధించిన గుంటూరు జిల్లాకు చెందిన బొలినేని చంద్రిక, షేక్ సాదియా, అల్మాస్, నాగం జ్ఞాన దివ్య, మందిర షానూన్‌లను సోమవారం మేయర్‌ను నగరపాలక సంస్థ కార్యాలయంలో కలిశారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధావన్‌గిరిలో నిర్వహించిన జూనియర్, సీనియర్ నేషనల్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఆంధ్రప్రదేశ్ తరఫున గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్లు బొలినేని చంద్రిక సీనియర్(సిల్వర్ మెడల్), షేక్ సాదియా అల్మాస్ జూనియర్(గోల్డ్ మెడల్), నాగం జ్ఞాన దివ్య, మందిర షానూన్, జూనియర్ బ్రాంజ్ మెడల్ సాధించిన నేపథ్యంలో వారిని నగర పాలక సంస్థ తరుపున ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని గోల్డ్ మెడల్స్ సాధించి, గుంటూరు జిల్లా ఖ్యాతిని పెంపొందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని పాల్గొన్నారు.

223వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం నాటికి 223వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావులు సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును ఏ కోర్టులో అప్పీలు చేసే వీలు లేదని.. అది తప్పక అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాషా, సాంబశివరావు, ఆశీర్వాదం, గురవయ్య, కార్మికులు వై.రమాదేవి, రిబ్కా, శారమ్మ, ఇమాంబి, దర్శి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నారాకోడూరులో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మూడు షాపుల్లో రూ.2.77 లక్షల విత్తనాలు అమ్మకాల నిలుపుదల

చేబ్రోలు: నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ స్టేట్ లెవల్ తనిఖీ బృందం అధికారులు ఎం.సునీల్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని రెండు ఎరువుల షాపులు, చేబ్రోలులోని ఒక షాపును అధికారులు సోమవారం తనిఖీ చేశారు. రూ.2,77,898ల వివిధ కంపెనీలక చెందిన విత్తనాలను అధికారులు అమ్మకాలను నిలుపదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. విజిలెన్స్ సీఐ సీహెచ్ రవిబాబు, గన్నవరం ఏడీఏ ఎం.సునీల్‌ల ఆధ్వర్యంలో స్టేట్ లెవల్ తనిఖీ బృందం నారాకోడూరులోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. పొన్నూరు ఏడీఏ పి.రామకోటేశ్వరి, చేబ్రోలు ఏవో పి.ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పురుగు మందులు, ఎరువులు, విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో పొన్నూరులోని పలు ట్రేడర్స్‌లో గల విత్తనాల నిల్వలను పరిశీలించారు. అనుమతి లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రూ.22,55,810 విలువైన 1726 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. తనిఖీల్లో ప్రత్యేక తనిఖీ బృందాలు ఎం.సునీల్, సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవిబాబు, రామకోటేశ్వరి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.కిషోర్, ఏవో ఆరు వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్

1400 గ్రాములు గంజాయి స్వాధీనం

పెదకాకాని: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇంటూరు కిరణ్, షేక్ సమీర్‌భాషా, గుంటూరుకు చెందిన సయ్యద్ చిన్న భాషాలు.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం ప్రాంతంలోని చింతపల్లికి చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 1500 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. అందులో 1400 గ్రాముల గంజాయిని పెదకాకాని వై జంక్షన్ శివారులో చిన్న చిన్న ప్యాకెట్‌లుగా తయారు చేస్తుండగా పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు పెదకాకాని సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

ఆరోగ్యంపై ఔషధ మొక్కల ప్రభావం అధికం



ఔషధ మొక్కలు నాటుతున్న చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు

మోతకద చలపతి ఫార్మశీలో ఔషధ వనం ప్రారంభం

మోతడక(తాడికొండ): ఆరోగ్యంపై ఔషధ మొక్కల ప్రభావం అధికంగా ఉంటుందని.. వాటిని పెంచి జీవన యానంలో వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మోతడక చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో సోమవారం జరిగిన ఔషధ వనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు ఔషధ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో అతిథి వినయ్ మాట్లాడుతూ.. ఆరోగ్యానికి తోడ్పడే మొక్కల్ని వివిధ రోగాలు నివారించే విధానంపై వివరించి ప్రాముఖ్యత తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని వెంకట రామారావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

- ఆయన క్షేమమే మా లక్ష్యం
- గుమ్మడికాయలతో దిష్టి తీసిన మహిళలు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు



దిష్టి తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజాదరణ తగ్గలేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి తాడేపల్లిలోని తన నివాసానికి రావడంతో నరదిష్టి తీసేందుకు భారీగా మహిళలు, లీగల్‌సెల్ నాయకులు గుమ్మడికాయలతో అక్కడకు చేరుకున్నారు. ఆయన రాగానే గుమ్మడికాయలపై కర్పూరం వెలిగించి దిష్టి తీశారు. ఈ సందర్భంగా లీగల్‌సెల్ నాయకులు బరిగెల కోటేష్, విజయవాడకు చెందిన మహిళా నాయకురాలు ప్రేమ్ త్రివేణి రెడ్డిలు మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్నా, పక్క రాష్ట్రంలో ఉన్నా పచ్చ మీడియాతో పాటు కూటమి నాయకులు రోజూ చర్చించుకుంటున్నారని.. ఆయనకు నరదిష్టి తగలకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్న మేడ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు విస్తృతం కావాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు. సోమవారం జేకేసీ కళాశాలలో ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ విభాగ ఆధ్వర్యంలో మేక్ ఏ డిఫరెన్స్(మేడ్) స్వచ్ఛంద సేవా సంస్థ కార్యకలాపాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా మేడ్‌లో భాగస్వాములైన వివిధ కార్పొరేట్ ఉద్యోగులతో పాటు మెడికల్, బీటెక్ విద్యార్థులు ఎండీ అఫ్రోజ్, కె.సంజన, బి.యువ తరుణ్, శ్రీనిత్య, సుజయ్, యాస్మిన్, సాయి రమేష్ జేకేసీ కళాశాల విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకున్నారు. అనాథలు, వికలాంగులతో పాటు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు తాము చేయూత ఇస్తామని వివరించారు. ఒక విద్యార్థిని ఐదుగురు చొప్పున విద్యార్థులు దత్తత తీసుకుని, గణితం, వ్యక్తిత్వ వికాసం, భాషా, భావ వ్యక్తీకరణ నైపుణ్యం అంశాల్లో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భయం, బిడియం పోగొట్టి, స్పీకింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి పర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ వైస్ చైర్మన్ పి.నాగసుశీల, కమిటీ ఆర్గనైజర్ కె.హర్షిత, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, భారతీయ భాషాశాఖల అధిపతి డాక్టర్ వై.ప్రశాంతి పాల్గొన్నారు.